## ప్రసంగము 2

# యేసు క్రీస్తు మరియు ఆయన సిలువ మరణం

## (1 కొరింథీయులకు 2:1, 2)

పౌలు కొరింథీ పట్టణమునకు వచ్చినప్పుడు ఆయన "బలహీనతతోను భయముతోను ఎంతో వణకుతోను" (1 కొరింథీయులకు 2:3) ఆ పట్టణమును ఎదుర్కొనెను. ఆయన యొక్క భావాలు అర్థము చేసుకొనదగినవి. త్రోయా విడిచి పెట్టి మాసిదోనియ మీదుగా వెళ్ళుచున్నప్పుడు (అపొస్తలుల కార్యములు 16:8-12), గ్రీసు దేశస్థులకు[1] సువార్త ప్రకటించుటకై తన ప్రయత్నంలో ఆయన తెలిసికొన్న విజయాలను అలాగే అనేకమైన అడ్డంకులను కలిగియుండెను. ఆయన ఫిలిప్పీ పట్టణములో కొట్టబడి మరియు చెరసాలలో వేయబడెను (అపొస్తలుల కార్యములు 16:22-40), బెరయా (అపొస్తలుల కార్యములు 17:13, 14), మరియు థెస్సలొనీకయాలో ఆయన యూదులచే హింసించబడెను (అపొస్తలుల కార్యములు 17:5-9) మరియు దేవుడు యేసును మృతులలోనుండి లేపెను అని ఏథన్సువారిని ఒప్పించుటలో కొంత విజయాన్ని సాధించెను (అపొస్తలుల కార్యములు 17:31-34). అటు తరువాత ఆయన అత్యంత ప్రాముఖ్యమైన మరియు ప్రబలమైన - బహుశ నేడు దాదాపు న్యూయార్క్ పట్టణమునకు సరిసమానమైన పట్టణమైన కొరంథీ పట్టణములోనికి ప్రవేశించెను. ఈ పెద్ద వ్యాపార కేంద్రమైన పట్టణము చెడుతనమునకు పెట్టిన పేరుగా నిలిచింది. అలాంటి పట్టణములోనికి వెళ్ళుచున్నప్పుడు పౌలు భయపడుట, వణుకుటలో ఆశ్చర్యమేమియులేదు![2]

అటువంటి పరిస్థితులలో ఆయన ఏమి చేసాడు? ఓ సువార్తికుడుగా క్రీస్తు సందేశముతో కొరింథీయులను చేరుటకు పౌలు చేసిన ప్రణాళికలేమిటి?

1 కొరింథీయులకు 2:1, 2లో మనకు యిలా చెప్పబడింది: "సహోదరులారా, నేను మీయొద్దకు వచ్చినప్పుడు వాక్చాతుర్యముతో గాని జ్ఞానాతిశయముతోగాని దేవుని మర్మమును మీకు ప్రకటించుచు వచ్చినవాడను కాను. నేను, యేసు క్రీస్తు అనగా, సిలువ వేయబడిన యేసుక్రీస్తును తప్ప, మరిదేనిని మీనుండి నెరుగకుందునని నిశ్చయించుకొంటిని."

ఇది పౌలు కొరింథీలో తన పనికొరకు చేసిన తీర్మాణము మాత్రమే కాదు. ఆయన తన శ్రోతలలోని ప్రతివారికి అర్థమగు రీతిగా ఆయన సందేశమును వివరించినను, ఆయన ఎక్కడకు వెళ్ళినా ఆయన ఒకే విధమైన సందేశము అనగా సిలువ వేయబడిన క్రీస్తునే ప్రకటించెను.[3] ఆయన మారుమనస్సు పొందిన వెంటనే పౌలు సమాజమందిరములో చేరి యేసు దేవుని కుమారుడని (అపొస్తలుల కార్యములు 9:20) మరియు దేవుడు ఆయనను క్రీస్తుగా చేసెను అని ప్రకటించాడు (అపొస్తలుల కార్యములు 9:22). ఆయన పిసిదియాలోనున్న సమాజమందిరములో క్రీస్తు సిలువవేయబడి మృతులలోనుండి లేపబడెను అని ప్రకటించెను (అపొస్తలుల కార్యములు 13:26-41). ఆయన థెస్సలోనీయాలో ప్రకటించినప్పుడు "క్రీస్తు శ్రమపడి మృతులలోనుండి లేచెనని," యేసు క్రీస్తుయియున్నాడనియు ప్రకటించెను

(అపొస్తలుల కార్యములు 17:3). ఆయన గ్రీకు తత్వవేత్తలకు బోధించునప్పుడు దేవుడు యేసును మృతులలోనుండి లేపెను అని ప్రకటించెను (అపొస్తలుల కార్యములు 17:30, 31). కాబట్టి, ఆయన కొరింథీ పట్టణముచేరుకొని ఆ ప్రజలను సమీపించుటలో కలిగియున్న సమస్యలను ఎదుర్కొన్నప్పుడు, ఆయన ఎల్లప్పుడు చేయునట్లుగానే అనగా "సిలువ వేయబడిన క్రీస్తునే" ఇప్పుడు కూడా ప్రకటించుటకు నిశ్చయించుకొనెను.

మనము కూడ ఆయన మాదిరిని అనుసరించలెను. మనము ఎక్కడ ప్రకటిస్తున్ననూ, ఎలాంటి ప్రేక్షకులను మనము కలిగియున్ననూ, మనము "సిలువ వేయబడిన క్రీస్తును" మాత్రమే ప్రకటించాలి. నేను అన్ని రాష్ట్రాలలోను మరియు అనేకమైన దేశాలలో – అనగా ఉదాహరణగా, ఆస్ట్రేలియా, తైవాన్, పోలాండ్ బంగ్లాదేశ్ మరియు న్యూజిలాండ్వంటి దేశాలలో దేవుని వాక్యమును ప్రకటించాను – అయితే అన్నిచోట్ల కూడ నా సందేశము పౌలువలే "సిలువవేయబడిన క్రీస్తునే" అని మరియు ఇక ముందుకూడ అలాగే ఉంటుంది అని ఆశిస్తున్నాను.

## క్రీస్తును ప్రకటించుట

"సిలువ వేయబడిన క్రీస్తును" ప్రకటించుట అనగా ఏమిటి? మొదట మనము క్రీస్తును ప్రకటించవలెను!

### ఆయన జీవిత చరిత్రను చెప్పు

క్రీస్తును ప్రకటించుట అంటే ఆయన జీవిత చరిత్రను తెలుపుట. ఆయన కన్య మరియ గర్భమందు జన్మించెను అని తప్పక ప్రకటించవలెను (మత్తయి 1:18–21). ఆయన తన 12వ సంవత్సరములో తన తల్లితండ్రులతో కూడ యెరూషలేమునకు వెళ్ళి ఆయన తన జ్ఞానముతో బోధకులకు ఆశ్చర్యము కలుగజేసెను (లూకా 2:41–52) అని చెప్పవచ్చు. ఆయన గలిలయలోని నజరేతులో మరియ యోసేపు కుమారునిగా ఎదిగెను; ఆయన సహోదరులను మరియు సహోదరీలను కలిగియుండి వడ్రంగివాడిగా ఉండెను (మార్కు 6:3). ఆయన అన్నివిధాలుగా మనుష్యుడిగా ఉండెను మరియు "మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడిగా ఉండెను" (హెబ్రీయులకు 4:15). ఆయన మనుష్యుడై ఉన్నప్పటికి పాపములేని జీవితమును జీవించెను.

ముప్ఫై సంవత్సరముల వయస్సులో యేసు యొర్దాను నదిలో బాప్తిస్మము ఇచ్చు యోహాను ద్వారా బాప్తిస్మము పొందెను (మత్తయి 3:13–17) అని మనము తప్పక ప్రకటించవలెను. అటు తరువాత ఆయన 40 రోజులు అరణ్యములో శోధించబడెను కానీ శోధనలలో పడి పోవుటకు తిరస్కరించెను (మత్తయి 4:1–11). ఆయన తనతో కూడ తన ప్రయాణములలో ఉండునట్లు మరియు తననుండి మాటలను నేర్చుకొని ఇతరులకు బోధించునట్లుగా యేసు పండ్రెండుమంది శిష్యులను ఎంచుకొనెను (మత్తయి 4:18–22; మార్కు 3:13–19). యేసు మూడు సంవత్సరాల తన పరిచర్యను ప్రారంభించాడు, ఆ సమయంలో ఆయన రోగులను స్వస్థపరచుచు, దయ్యములను వెళ్ళగొట్టుచూ, ప్రజలకు బోధించుచూ తన సమయమును గడిపెను, ఆయన జనసమూహములకు అలాగే తన శిష్యులకు కూడా బోధించెను (మత్తయి 9:35). పేతురు కొర్నేలీ ఇంటివారితో మాట్లాడుతున్నప్పుడు ఆయన యేసు క్రీస్తు యొక్క

భూసంబంధమైన పరిచర్యను అనగా: "దేవుడు నజరేయుడైన యేసును పరిశుద్ధాత్మతోను శక్తితోను అభిషేకించెననునదియే. దేవుడాయనకు తోడైయుండెను గనుక ఆయన మేలుచేయుచు, అపవాదిచేత పీడింపబడిన వారినందరిని స్వస్థపరచుచు సంచరించుచుండెను" (అపొస్తలుల కార్యములు 10:38) అని వివరించెను.

యేసు పరిచర్య యేసు యొక్క ప్రకటనలపై యూదుల యొక్క కోరిక మేరకు, రోమీయులచే తన యొక్క మరణంతో సంపూర్ణమైంది. ఆయన మరణించిన తరువాత పునరుత్థానుడాయెను, ఆరోహణ మహిమపరచబడెను (అపొస్తలుల కార్యములు 2:32-36). ఆయన పరలోకానికి ఆరోహణమగుచున్నప్పుడు అపొస్తలులకు గొప్ప ఆజ్ఞను ఇస్తూ "మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి" (మత్తయి 28:19) అని చెప్పెను.

మనము ఆయన జీవితమును గూర్చి నేర్చుకొన్నప్పుడు ఆయనను అనుసరించినట్లు బలవంత పెట్టబడతాము. ఎంతో దయా గుణము కలిగినవాని యొక్క (మత్తయి 11:28-30) ఆహ్వానమును ఒకడు ఎట్లు తిరస్కరించగలడు? ఆయన యొక్క జీవితమును అనుకరించునట్లుగా మరియు ఆయన యొక్క "అడుగు జాడలను" అనుసరించునట్లు మనము తప్పక ప్రేరేపించబడవలెను (1 పేతురు 2:21).

**ఆయన దేవుని కుమారుడని మరియు మానవుల రక్షకుడని ప్రకటించవలెను**

మనము ఆయన గూర్చి ప్రకటించునప్పుడు ఆయన దేవుని కుమారుడని మరియు మానవాళి యొక్క ఏకైక రక్షకుడని కూడ చేర్చవలెను. ఆయన యొక్క అద్భుత కార్యములు ఆయన దేవుని కుమారుడను వాస్తవమును ఎత్తిచూపుటకు సూచనలైయున్నాయి (యోహాను 20:30, 31). యేసు తన కుమారుడని స్వయంగా దేవుడే గుర్తించెను (మత్తయి 3:17; 17:5). అనేకులవలే (చూడుము ఉదాహరణకు యోహాను 1:49) పేతురు కూడ ఆయన "సజీవుడగు దేవుని కుమారుడని" (మత్తయి 16:16) ఒప్పుకొనెను. యేసు కూడ తాను దేవుని కుమారుడని మరియు తాను దైవమని తనకు తాను ప్రకటించుకొనెను (యోహాను 10:33-36; చూడుము 8:24, 58). ఆయన పునరుత్థానము ఆయన యొక్క దైవత్వానికి గొప్ప రుజువు (అపొస్తలుల కార్యములు 2:32-36; రోమీయులకు 1:4). ఆయనను ఒక దైవముగా కాక కేవలం ఒక మంచి మనిషిగా చూపించే ఏ వర్ణనయైన బైబిలు చిత్రీకరించు యేసు క్రీస్తు కాకపోవును.

క్రీస్తును ప్రకటించుటలో, మనము ఆయనను రక్షకునిగా మరియు మానవాళికి ఏకైక నిరీక్షణగా తప్పక అందించవలెను. పేతురు చెప్పిన ప్రకారము, "మరి ఎవనివలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము" (అపొస్తలుల కార్యమును 4:12) అన్నట్లుగా తప్పక ప్రకటించవలెను. దేవునివద్దకు ఆయన ఒక్కడే మార్గమని తప్పక సూచించవలెను (యోహాను 14:6).

**ఆయన ప్రభువని కనపరచవలెను**

యేసు దేవుని కుమారుడని, రక్షకుడని ప్రకటించుటకు అదనముగా యేసును ప్రభువుగా అందించవలెనని దేవుడు యేసునే "ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను" (అపొస్తలుల

కార్యములు 2:36) అని పేతురు స్పష్టపరచెను. రక్షించబడుటకు ప్రజలు యేసును ప్రభువుగా గుర్తించవలెను (రోమీయులకు 10:9).

"ప్రభువు" అనే పేరు ఏమి సూచిస్తుంది? ప్రభువు అనే యేసు యొక్క "దైవత్వాన్ని" వివరించుట మాత్రమే (యోహాను 20:28), ఆయన యొక్క ప్రభావము, ఆయన అధికారమును, మరియు ఆయన రాజరీకమును సూచించుచున్నది. ఆయన యజమాని మరియు పరిపాలించువాడని అది చెప్పుచున్నది. దేవుడు తనకు "పరలోకమందును మరియు భూలోకమందును సర్వాధికారము" యిచ్చియున్నాడని (మత్తయి 28:18; అలాగే 7:28, 29 చూడుము) యేసు చెప్పెను. ఆయన తన రాజ్యమునకు రాజు (యోహాను 18:36, 37) మరియు సంఘము యొక్క శిరస్సు. దేవుడు, "సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి, సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము; అది సమస్తమును పూర్తిగా నింపుచున్న వాని సంపూర్ణతయై యున్నది" (ఎఫెసీయులకు 1:22, 23).

యేసు సంఘమునకు ప్రభువైయున్నాడు. ఆ సంఘమను శరీరమును ప్రేమించి దానికొరకు చనిపోయాడు (ఎఫెసీయులకు 5:25). మనము క్రీస్తును గూర్చి ప్రకటించుచున్నప్పుడు, మనము ఆయన యొక్క సంఘమును గూర్చి, అనగా ఆయన యొక్క ప్రియమైన శరీరమును గూర్చి తప్పక చెప్పవలెను. ఇంకా ఆయనను సంఘమునకు ప్రభువుగా ఉండుటను అంగీకరించాలి. క్రొత్త నిబంధన ద్వారా ఆరాధన గూర్చి, సంఘముయొక్క వ్యవస్థను గూర్చి, మరియు దాని యొక్క బోధను గూర్చి సంఘమునకు మార్గదర్శకత్వాలను అందించుటకు ఆయనను ప్రభువుగా తప్పక అంగీకరించాలి. క్రీస్తు ప్రభువైనందున, ఆయన అధికారమును గుర్తించాలి మరియు ఆయన ఆదేశాలను అంగీకరించాలి; క్రొత్త నిబంధన ఏమి బోధిస్తుందో దానిని అనుసరించాలి!

దీనికి అదనముగా, సంఘములోని ప్రతివారు ప్రభువును మన జీవితములకు ప్రభువుగా గుర్తించవలెను. మనము "క్రీస్తుతో కూడ లేపబడినవారమైతే పైనున్నవాటినే వెదకుడి, అక్కడ క్రీస్తు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండియున్నాడు" (కొలొస్సయులకు 3:1). క్రీస్తు యొక్క అధికారము క్రింద జీవించుటయంటే దేవుని యొక్క చిత్తము చొప్పున జీవించుట. వేరొక మాట లలో చెప్పాలంటే, క్రీస్తును గూర్చి ప్రభువని ప్రకటించుటయంటే సంఘమునకు మరియు ఒక్కొక్క క్రైస్తవునికి కూడ క్రీస్తువారు ఏమి చేయాలని కోరుకున్నాడో తెలియజేయుట.

**ఆయనను రానున్న తీర్పరిగా ప్రకటించుడి**

క్రీస్తు మరలా రావలసినవాడైయున్నాడని, మరియు ఆయన మరలా వచ్చినప్పుడు మానవాళికి తీర్పుతీర్చునని మనము తప్పక ప్రకటించవలెను. యేసుక్రీస్తు యొక్క గాథ ఆయన పరలోకానికి ఆరోహణము మహిమపరచబడుటతోనే ముగియలేదు. ఆయన మరలా రానున్నాడు (అపొస్తలుల కార్యమును 1:11)! కాబట్టి, క్రీస్తు మరలా రాడు అని చెప్పు ఏ బోధయైనను వ్యతిరేఖమైనది.

యేసు మరలా వచ్చినప్పుడు, ఆయన లోకమునకు తీర్పు తీర్చును (అపొస్తలుల కార్యములు 17:31; మత్తయి 25:31-46) మరియు "దేవుని నెరుగనివారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికి ప్రతిదండన" చేయును (2 థెస్సలొనీకయులకు

1:7-9; KJV). క్రీస్తు యొక్క రెండవ రాకడ మరియు తీర్పుతీర్చువానిగా ఆయన పాత్ర రెండింటిని గూర్చి కూడ క్రొత్త నిబంధన కాలములో అటు పాపులకును మరియు పరిశుద్ధులకును బోధించబడింది. ఉదాహరణకు, పౌలు ఫెలిక్సుతో మాట్లాడినప్పుడు, ఆయన "నీతిని గూర్చియు, ఆశానిగ్రహమును గూర్చియు, రాబోవు విమర్శను" గూర్చి (అపొస్తలుల కార్యములు 24:25; అలాగే అపొస్తలుల కార్యములు 17:30, 31 చూడుము) మాట్లాడెను. దాని ఫలితము, ఫెలిక్సు వెంటనే "మిగుల భయపడెను." వాస్తవానికి, క్రీస్తు యొక్క న్యాయ పీఠము యెదుట నిలబడు సమయంలో పాపులు తప్పక భయపడవలెను. ఏది ఏమైనప్పటికి, విశ్వాసులైన క్రైస్తవులు ప్రభువు రాకడను గూర్చి భయపడనవసరం లేదు; వారికి అది రక్షణ దినము (హెబ్రీయులకు 9:28)! ప్రభువునకు విధేయులైనవారు ఆయన రాకడ కొరకు ఎదురుచూడవచ్చు (2 తిమోతి 4:7, 8) నిర్భయముగా "ప్రభువైన యేసూ రమ్ము" (ప్రకటన 22:20; 1 కొరింథీయులకు 16:22 చూడుము[4]) అని చెప్పుదురు. ఆయన మనకు తీర్పు తీర్చును అన్న మాటను ఉపేక్షించు ఏ వాక్య చిత్రమైన అసంపూర్ణమైనది మరియు ఖచ్చితముకానిది.

## సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించుట

కొరింథీలో పౌలు క్రీస్తును మాత్రమే ప్రకటించలేదు కాని "క్రీస్తు సిలువ వేయబడినాడని" కూడ ప్రకటించాడు. పౌలు యొక్క మాదిరి అనుసరించుటకు మనము కూడ తప్పక ఆయనవలే క్రీస్తు యొక్క మరణమును ప్రకటించవలెను. "సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించుటయంటే ఏమిటి" (1:23)?

### సిలువ సందేశమును తెలియజేయుట

ప్రారంభమునుండి కూడ అనేకులు క్రీస్తు మరణము యొక్క అర్థమును గ్రహించుటలో విఫలమయిరి. మన పాపముల కొరకు ఆయన మరణించకపోయినట్టయితే, మన ఆత్మలకు రక్షణ ఉండేదికాదు.

*వెఱ్ఱి సందేశము కాదు.* మొదటి శతాబ్దపు శ్రోతలకు సిలువ సందేశము హాస్యాస్పదమైనదిగా తోచినది (1 కొరింథీయులకు 1:23). ఒక సిలువ వేయబడిన వ్యక్తి – అనగా పాత నిబంధన ప్రకారం శాపగ్రస్థుడైనవాడు – క్రీస్తు ఉన్నాడన్న విషయమునకు యూదులు తడబడిరి. సిలువ వేయబడిన రక్షకుడు అనే ఆలోచన వెఱ్ఱితనమైయున్నదని అన్యజనులు అనుకొనిరి. సిలువ సందేశమును ప్రకటించుట నేడున్న ప్రజలకు కూడ అంతగా జ్ఞాన యుక్తమైనది అనిపించదు. బహుశ వారు "రెండు వేల సంవత్సరముల క్రిందట చనిపోయిన వ్యక్తి యొక్క మరణం నాకేమి చేయును?" అని ఆశ్చర్యపడియుండవచ్చు. ఏది ఏమైనప్పటికి, అది మానవాళికి వెఱ్ఱితనముగా కనిపించిననూ, సిలువ సందేశము రక్షించుటకైన దేవుని శక్తిగా ఉందని మనము పౌలుతో కూడ ఏకీభవించుదుము (1 కొరింథీయులకు 1:18).

*కేవలము హత సాక్షిని గూర్చిన సందేశమే కాదు.* చివరకు నామకార్థ క్రైస్తవులకు కూడ క్రీస్తు యొక్క మరణము సరియైన అర్థమును యివ్వదు. వారు సిలువను అర్థవంతముగా చూడవచ్చు; దాని నిజమైన అర్థమును కనుగొనకపోవచ్చు. అయిననూ దాని త్యాగానికి మాదిరిగా, లేదా ఒక అమాయకుడు తనకై చనిపోవుటయని అనుకొనవచ్చు. అవును అది

నిజమే, కానీ దానికంటె ఇంకా చాలా కలదు. సంవత్సరాలుగా వందలమంది అమాయక ప్రజలు వేరువేరు కారణాల కొరకు హత సాక్షులుగా చనిపోయిరి. ఒకవేళ యేసు ఒక అత్యున్నతమైన కారణంకొరకు శ్రమపడుటకు మాదిరిగా చనిపోయినట్లెయితే, అప్పుడు అతని మరణం ఒక అపూర్వమైనది కాక పోయియుండవచ్చు. ఏదిఏమైనప్పటికి యేసు యొక్క మరణం ప్రత్యేకమైనదే!

*పాప పరిహారార్థబలిగా యేసును గూర్చిన సందేశము.* యేసు ఒక హతసాక్షిగా చనిపోలేదు. యేసు పాపుల పాపముల కొరకు పాపములేని బలియర్పణగా, దానిబట్టి అతనిద్వారా మనలను పాపములనుండి విడిపించులాగున యేసు చనిపోయెను. మనము పాపములను భరించకుండునట్లు మన పాపములను ఆయన భరించెను మరియు వాటిని బట్టి శిక్షింపబడెను. మనము శ్రమనొందవలసియుండగా ఆయన శ్రమ పొందెను. లేఖనాల యొక్క సాక్ష్యమును గమనించుము:

- "యేసు లోకపాపములను మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల" (యోహాను 1:29) అని బాప్తిస్మము ఇచ్చు యోహాను అన్నాడు.
- "మనమాయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను [క్రీస్తును] మన కోసము పాపముగా చేసెను" అని 2 కొరింథీయులకు 5:21 చెప్పుచున్నది.
- "లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిపొందెను" అని పౌలు వ్రాసెను (1 కొరింథీయులకు 15:3బి).
- "అయితే ఆయన (క్రీస్తు) యుగముల సమాప్తియందు తన్నుతానే బలిగా అర్పించుకొనుటవలన పాపనివారణ చేయుటకై యొక్కసారే ప్రత్యక్షపరచబడెను" అని హెబ్రీయులకు 9:26 చెప్పుచున్నది.
- "మనము పాపముల విషయమై చనిపోయి, నీతివిషయమై జీవించునట్లు, ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసికొనెను. ఆయన పొందిన గాయములచేత మీరు స్వస్థతనొందితిరి" అని పేతురు 1 పేతురు 2:24లో చెప్పాడు.
- యోహాను వ్రాసిన ప్రకటన 1:5లో యోహాను యేసును, "నమ్మకమైన సాక్షియు, మృతులలోనుండి ఆది సంభూతుడుగా లేచినవాడును, భూపతులకు అధిపతియైన" అని యేసును గూర్చి మాట్లాడెను.
- ప్రకటన 7:14లో "వీరు మాహా శ్రమలనుండి వచ్చినవారు; గొఱ్ఱెపిల్ల రక్తములో తమ వస్త్రములను ఉదుకు కొనినవారు" గా విమోచింపబడినవారని గూర్తించిరి.

"సిలువ వేయబడిన క్రీస్తును" ప్రకటించుట, తరువాత యేసు క్రీస్తు మన పాప పరిహార్థ బలి అనగా మన పాపములకు "పరిహారము చెల్లించిన ఏకైక వ్యక్తి ఆయనే మన పాపములకు శాంతికరమై యున్నాడు; మన పాపములకు మాత్రమేకాదు, సర్వలోకమునకును శాంతికరమై యున్నాడు" (1 యోహాను 2:2; అలాగే చూడుము 1 యోహాను 4:10; రోమీయులకు 3:25) అని ప్రకటించుటయై ఉన్నది.

**సిలువ సందేశమును అన్వయించుము**

నేడు సిలువ సందేశము ఎట్లు అన్వయించబడును? “సిలువవేయబడిన క్రీస్తును” ప్రకటించుటయంటే “సువార్తను” ప్రకటించుట. సిలువ సందేశము అందరికి సువార్త (శుభవార్త)యై ఉన్నది. అది నీకు శుభవార్త. ఎందుకనగా, లెక్క చెప్పవలసిన వ్యక్తిగా నీవు పాపివైయున్నావు కాబట్టి (రోమీయులకు 3:23) నీ పాపములను బట్టి నీవు మరణ శిక్షనొందవలసినవాడు (రోమీయులకు 6:23; ఎఫెసీయులకు 2:1). క్రీస్తు నీ కొరకు చనిపోయియుండకపోతే నీకు ఏ నిరీక్షణ ఉండేది కాదు. ఆయన నీ కొరకు చనిపోయాడు కాబట్టి నీవు నిరీక్షణ కలిగియుండవచ్చు. నీవు ఏదైతే అనగా నిన్ను నీవు రక్షించుకొనుట చేయలేవో – అది క్రీస్తు నీకొరకు చేసెను. నీవు చెల్లించలేని ఒక ఋణాన్ని కలిగియున్నావు, క్రీస్తు ఆ ఋణమును చెల్లించెను, అది ఆయన ఋణపడినది కాదు. అయితే ఆ ఋణాన్ని[5] సిలువ పై నీ కొరకు మరణించుట ద్వారా, నీవు పొందవలసిన శ్రమను తాను పొందుట ద్వారా యేసు నీ రుణాన్ని తీర్చెను. ఆయన అలా చేసాడు కాబట్టి నీవు రక్షించబడుదువు. నీ పాపములు ఏవైనప్పటికీ అవి క్రీస్తు యొక్క రక్తములో కడిగివేసుకొనవచ్చును!

క్రీస్తు యొక్క మరణముద్వారా లభించిన రక్షణను అంగీకరించుటకు నీవేమి చేయాలి? “క్రీస్తును మీ హృదయములోనికి ప్రవేశించనియ్యుడి” అని బైబిల్ చెప్పుట లేదు లేదా “క్రీస్తును మీ వ్యక్తిగత రక్షకునిగా అంగీకరించమని” ఆజ్ఞాపించుట లేదు – అయితే “సిలువ వేయబడిన క్రీస్తును” గూర్చిన సందేశము విని విశ్వసించిన వారికి బైబిల్ ఏమి చెప్పుచున్నది? “మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు” (అపొస్తలుల కార్యములు 2:38). ఎవరైతే ప్రభువు యొక్క ఆజ్ఞను అంగీకరించుదురో – క్రీస్తు యేసును విశ్వసించి ఆయనను దేవుని కుమారునిగా ఒప్పుకొందరో, మారు మనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుదురో వారు – దేవుని యొక్క కృపను బట్టి దేవుని గొఱ్ఱెపిల్ల రక్తములో తమ యొక్క పాపములను కడిగివేసుకుందురు!

మీరు రక్షించబడుదురు! ఇదియే “సిలువ వేయబడిన క్రీస్తును” గూర్చిన సందేశమును నుండి ఉద్భవించు శుభవార్త లేదా సువార్త!

**ముగింపు**

“సిలువ వేయబడిన క్రీస్తును” గూర్చిన సందేశము విన్న తరువాత నీవు ఎట్లు స్పందించెదవు? మొదటి శతాబ్దమునుండి ఆ నాటి వరకు అనేకులవలే దానిని వెఱ్ఱితనముగా గ్రహించుదువా? “సిలువను గూర్చిన వార్త, నశించుచున్నవారికి వెఱ్ఱితనముగాను రక్షంపబడుచున్న మనకు దేవుని శక్తి” అని 1 కొరింథీయులకు 1:18 తెలియజేస్తుంది. కావలయుననుకొంటే; మీకు సందేశము పరిహాసంగా ఉండవచ్చు, కానీ ఎంత కాలమైతే మీరు సందేశమును వెఱ్ఱితనముగా తలంచుదురో అప్పటి వరకును మీరు రక్షించబడనివారిగానే ఉందురు. ఇంకొకవైపు ఎవరైతే ఈ సందేశము అంగీకరింతురో వారు ఈ సందేశములోని శక్తిని గ్రహించి దాని ద్వారా రక్షించబడుదురు. రెండింట్లో ఏది కావాలి? సిలువ సందేశమును వెఱ్ఱితనముగా ఎంచి నశంచుటయా, లేదా దానిని ఒక వాస్తవముగా అంగీకరించి రక్షించబడుటయా?

## సూచనలు

[1]ఇక్కడ మనము మాసిదోనియా ప్రజలను ఏథెన్సు వారితో కూడ "గ్రీకు" వారిగా పరిగణిస్తున్నారు. [2]ఆయన భయముతోను మరియు వణుకుతోను ఉండెను అనటానికి అధారము యేసు ఆయనకు ప్రత్యక్షమై "నీవు భయపడక మాటలాడుము" (అపొస్తలుల కార్యముమను 18:9) అని దీనిలో కలదు. [3]పౌలు గ్రీకు యొక్క చాతుర్యమును బంధనా పద్ధతులను ఉపయోగించి కానీ ఫలితాన్ని చూసి నిరాకరించినట్లు కొందరు సూచిస్తారు. ఫలితముగా కొరింథీలో ఆయన అలంకార భాషను విడిచి కేవలము "సిలువవేయబడిన క్రీస్తునే" ప్రకటించడానికి సిద్ధపడినట్లు కొందరు చెప్తారు. [4]16:22లోని గ్రీకు పదమైన మరనాథా అనగా "రమ్ము ప్రభువా" లేదా "ప్రభువా రమ్ము." [5]ఈ వాక్యభాగము "He Paid a Debt," *Songs of Faith and Praise,* comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1994).